వెన్నెముక ఉండలబద్దలాగ వంగి వెల బడుతుంది. మొత్తంమీద మనిషి కొంచెం సన్నంగా, నిర్లక్ష్యంగా వుంటాడు.

పడవ మళ్ళీ నిశ్శబ్దంగా సాగుతోంది. పడవ వెనకభాగంలో నిప్పు రగలడం లేదు. సరంగులు తిండితిన్న గిన్నెలు తాపీగా మాట్లాడుకుంటో కడుక్కుంటున్నారు.

గాలి చలిగా లేదు. అయినా నేను కండువా కప్పుకున్నాను. అనంతమయిన ఆ చీకటికి అసహాయంగా శరీరాన్ని అప్పగించడానికి నాకు భయంవేసింది. గాలి మాత్రం చురుకుగా వుంది—మెత్తని స్త్రీ స్పర్శలాగ. పడవ నీటిమీద ఎంత మృదువుగా రాసుకుపోతోంది! చెప్పలేనంత మృదుత్వం. విశాలమయిన స్త్రీత్వం ఆ రాత్రిలో విందుగా ఆసరించుకుని వుంది. ఆ కౌగిలిలో నాకు చిరకాలంనాటి విషాద గాథలు మెల్లగా ఆప్యాయంగా జ్ఞాపకమొస్తున్నాయి—అనాదినించీ—మగవాణ్ణి లాలించి పోషించిన స్త్రీత్వపు గాథలు.

నాకు కొంచెం దూరంలో రెండు చుట్టలూ ఎర్రగా కాలుతున్నాయి. జీవితం బరువుగా అక్కడ కూర్చుని ఆలోచించుకుంటూ చుట్ట కాలుస్తున్నట్టు నాకు అనిపించింది.

"వాచ్చీ దేవూరు!" అన్నాడు పద్దాలు.

"కొల్లారి" అంది రంగి.

"ఇంకా శానాదూర ముంది."

"ఇయ్యాల జాగర్తుంద్రా. వొద్దు వొద్దు. ఈలు సూసుకుని తరవాత! ఏరా నామాటినవూ!" రంగి జాలిగా బతిమాలుతూ అడిగింది.

"బెదురు. నెంజకి" అన్నాడు పద్దాలు. అంటూ ఆమెపక్కలో వేలెట్టి పొడిచాడు.

"అమ్మో!" అంది రంగి. అవి తన్మయంగా ఆకాశంలోకి ముఖమెత్తి చీకట్లోకి చూసింది. ఆ స్పర్శ శాశ్వతంగా ఉండిపోవాలని కోరుతున్నట్టుగా ఆమె ముఖమెత్తింది.

నాకు క్రమంగా నిద్రపట్టింది. పడవంతాకూడా నిద్రపోతో. నీటివాలుకి మెల్లగా జారిపోతూంది. నాకు కొంచెం దూరంలో ఆ ఇద్దరు వ్యక్తులూ కొంతసేపు గుసగుసలాడుకున్నారు. నాకు నిద్ర పట్టినా పూర్తిగా పట్టలేదు. పడవ నడుస్తున్నట్టు తెలుసును. పడవ నెవరూ లాగడంలేదు. పడవలోజనం అంతా కునుకుతున్నారు. రంగి నా పక్కనించి నడిచి చుక్కానిదగ్గరకు వెళ్ళి కూచుంది.

"మరిదీ! ఎలాగున్నా!" అంది.

"మవ్వెల్లాగున్నా!" అన్నాడు చుక్కాని కాపేవాడు.

"ఎన్నెన్ని పిత్తరాలు సూపించాడనుకున్నా మావోడు! చిపీమా కెళ్ళాం! ఓడల్ని సూశాం! ఓడంటే ఓడకాదు మరిదీ! మా వూరంతుంది. మరి సుక్కానెక్కడుందో గాని!" రంగి అల్లా ఏవో చాలాసేపు కబుర్లు చెపుతో కూర్చుంది. ఆ కబుర్లు నన్ను జోకొడుతున్నట్టు

